



ఆర్టీసీ ద్వారకా సిటీ బస్టాప్ వద్ద నిరీక్షిస్తున్న ప్రయాణికులు

అనకాపల్లి ఎంపీ సీటుపై నాగబాబు ఆసక్తి?

పొత్తులో భాగంగా జనసేనకు కేటాయిస్తారని ఊహాగానాలు

- అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆత్మీయ సమావేశాలు



అనకాపల్లిలో ఈ నెల 10వ తేదీన నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న నాగబాబు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో జిల్లాలో ప్రధాన రాజకీయ పార్టీల నుంచి ఎవరెవరు పోటీచేస్తారన్న కొద్ది రోజుల నుంచి ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశం పార్టీ వచ్చే ఎన్నికల్లో జనసేనతో కలిసి పోటీ చేయాలని ఇప్పటికే నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ కూటమిలో బీజేపీ కూడా చేరుతుందని కొద్ది రోజుల నుంచి వార్తలు వస్తున్నాయి. మరోవైపు తెలుగుదేశం, జనసేన పార్టీలు ఏయే సీట్లలో పోటీ చేయాలో కసరత్తు జరుగుతున్నది. పొత్తులో భాగంగా జిల్లాలోని ఏకైక లోక్‌సభ స్థానం అనకాపల్లి నుంచి పోటీ చేయడానికి ఇరుపార్టీల నేతలు ఆసక్తి చూపుతూ, టికెట్ తమకు కేటాయించాలని పార్టీ అధినేతలను కోరుతున్నారు. వైసీపీ పాలనపై ప్రజల్లో తీవ్రవ్యతిరేకతతోపాటు తాము కూటమిగా పోటీచేస్తుండడంతో వచ్చే ఎన్నికల్లో అనకాపల్లి ఎంపీ స్థానాన్ని కచ్చితంగా గెలుచుకుంటామని టీడీపీ, జనసేన నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే ఏ పార్టీ పోటీచేయాలన్న దానిపై రాష్ట్రస్థాయిలో ఇరుపార్టీల అగ్రనేతలు ఇంతవరకు ఒక నిర్ణయానికి రాలేదు. తన కుమారుడు, ఐటీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌కు అనకాపల్లి ఎంపీగా పోటీ చేసే అవకాశం ఇవ్వాలంటూ మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు బహిరంగంగానే టీడీపీ అధినేత చంద్రబాబును కోరారు. అయితే సామాజిక సమీకరణాల నేపథ్యంలో భైరా ఫౌండేషన్ ఛైర్మన్, పారిశ్రామికవేత్త భైరా దిలీప్ చక్రవర్తి పేరు ఇటీవల తెరపైకి వచ్చింది. ప్రస్తుతం ఇతను ఇటు టీడీపీ, అటు జనసేన సభ్యుడు కానప్పటికీ అనకాపల్లి సీటు ఏ పార్టీకి కేటాయిస్తే ఆ పార్టీలో చేరి పోటీ చేయాలని భావిస్తున్నట్టు తెలిసింది.

తాజాగా తెరపైకి నాగబాబు

కాగా అనకాపల్లి పార్లమెంట్ స్థానం నుంచి జనసేన పార్టీ అధినేత పవణ్‌కల్యాణ్ సోదరుడు, ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు పేరు తెరపైకి వచ్చింది. గత వారం ఆయన పార్లమెట్ నియోజకవర్గం పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఆయా నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలు, వైసీపీ ప్రభుత్వ వైఫల్యం గురించి మాట్లాడడమే కాకుండా టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి వస్తే ఆయా సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. దీంతో పొత్తులో భాగంగా అనకాపల్లి ఎంపీ సీటు జనసేనకు కేటాయిస్తారని, నాగబాబు పోటీ చేస్తారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

2009లో పీఆర్పీ తరఫున అల్లు అరవింద్ పోటీ

పదిహేను సంవత్సరాల క్రితం సినీ నటుడు చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీ తరఫున ఆయన బావమరిది, నిర్మాత అల్లు అరవింద్ అనకాపల్లి నుంచి ఎంపీగా పోటీ చేశారు. అప్పటి కాంగ్రెస్, టీడీపీ అభ్యర్థులకు గట్టి పోటీ ఇచ్చిన ఆయన 2,94,183 ఓట్లతో (28 శాతం) మూడో స్థానంలో నిలిచారు. నాటి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సబ్బం హరి విజయం సాధించిన విషయం తెలిసిందే. మళ్లీ ఇప్పుడు చిరంజీవి తమ్ముడు పవన్‌కల్యాణ్ స్థాపించిన జనసేన పార్టీ తరఫున పోటీకి సోదరుడు నాగబాబు పేరు తెరపైకి వచ్చింది.

జేఈఈ మెయిన్స్‌లో మెరుపులు

99.999, 99.990 పర్సంటైల్ సాధించిన విశాఖ విద్యార్థులు



రిషివర్ధన్
99.999 /1000



ధనుకొండ శ్రీనిధి
99.990 /1000

- వెయ్యి నుంచి 1,500 మంది 99.00 నుంచి 99.999 పర్సంటైల్ సాధించారని అంచనా
- కార్పొరేట్ విద్యా సంస్థల విద్యార్థుల హవా

విశాఖపట్నం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి):

ఐఐటీ/ఎన్ఐటీల్లో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించిన జేఈఈ మెయిన్స్ 'సెషన్-1'లో విశాఖపట్నం విద్యార్థులు సత్తా చాటారు. నగరంలో చదివిన మద్ది రిషివర్ధన్ 99.999, ధనుకొండ శ్రీనిధి 99.990 పర్సంటైల్ సాధించారు. ఏటా రెండు పర్యాయాలు జేఈఈ పరీక్షలు నిర్వహిస్తారు. తొలి సెషన్ గత నెలలో 300 మార్కులకు నిర్వహించారు. ఏప్రిల్‌లో మరోమారు పరీక్ష నిర్వహిస్తారు. తొలి సెషన్ పరీక్షలకు నగరంలో 20 వేల మంది వరకూ హాజరయ్యారు. తొలి సెషన్ పరీక్షలో శ్రీచైతన్య, నారాయణ, ఫిట్జీ, అసెంట్, తదితర సంస్థల్లో చదివిన విద్యార్థులు మెరుగైన పర్సంటైల్ సాధించారు. 99.00 నుంచి 99.999 పర్సంటైల్ వరకూ 1000 నుంచి 1500 మందికిపైగా సాధించారని అంచనా వేస్తున్నారు. నారాయణ విద్యా సంస్థకు చెందిన మద్ది రిషివర్ధన్ 99.999 పర్సంటైల్‌తో మొదటి స్థానంలో, శ్రీచైతన్య ఐఐటీ అకాడమీకి చెందిన ధనుకొండ శ్రీనిధి 99.990 పర్సంటైల్‌తో రెండో స్థానంలో నిలిచారు. రిషివర్ధన్ గణితంలో 100కి 100, ఫిజిక్స్‌లో 90, కెమిస్ట్రీలో 95 మార్కులు సాధించాడు. నారాయణ విద్యా సంస్థల్లో 99.900, అంతకంటే ఎక్కువ పర్సంటైల్ 57 మంది సాధించారు. శ్రీచైతన్యకు చెందిన కోరుప్రోలు రాకేశ్ 99.978, బీరి సాహితి 99.977, చింతల తేజస్విని మనోజ్ఞ 99.974 ... మిగతా 6వ పేజీలో

ప్రయాణికులతో ఆడుకున్నారు

సీఎం సభకు నాలుగో వంతు ఆర్టీసీ బస్సులు

- ఉదయం 10 గంటల నుంచే మళ్లింపు
- బస్టాపుల్లో జనం పడిగాపులు
- మరోవైపు వార్డుల్లో ఆర్పీల బెదిరింపులు
- సభకు రాకపోతే రుణమాఫీకి సంతకాలు చేయబోమని డ్వాక్రా గ్రూపు సభ్యులకు హెచ్చరికలు
- అయినా స్పందన శూన్యం



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న సీఎం జగన్మోహన్‌రెడ్డి

విశాఖపట్నం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి):

'ఆడుదాం...ఆంధ్రా' క్రీడా పోటీల ముగింపు వేడుకల నిర్వహణ పేరుతో పాలకులు మంగళవారం నగర ప్రజలకు చుక్కలు చూపించారు. పీఎం పాలెంలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఏర్పాటుచేసిన బహుమతి ప్రదానోత్సవాన్ని రాజకీయ కార్యక్రమంగా మార్చేశారు. సీఎం జగన్ హాజరవ్వడంతో ఆర్టీసీ బస్సుల్లో నాలుగో వంతు (230) జనాన్ని తరలించేందుకు కేటాయించారు. దాంతో ఆర్టీసీ బస్సులపై ఆధారపడిన నగర వాసులు మంగళవారం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

స్టేడియం వద్దకు జనాలను తరలించేందుకు నగరంలో వార్డుకు ఐదు నుంచి ఎనిమిది బస్సులు చొప్పున కేటాయించారు. జనసమీకరణ బాధ్యతలను డ్వాక్రా గ్రూపుల ఆర్పీలకు అప్పగించారు. మధ్యాహ్నం రెండు గంటలకు ఈ బస్సులు బయలుదేరాల్సి ఉండగా చాలాచోట్ల ఎవరూ ముందుకు రాలేదు. దాంతో గ్రూపు సభ్యులకు ఆర్పీలు ఫోన్లు చేసి తప్పనిసరిగా రావాల్సిందేనని చెప్పారు. అయినా ఎవరూ స్పందించకపోవడంతో బెదిరింపులకు దిగారు. ప్రస్తుతం రుణమాఫీ కార్యక్రమం జరుగుతోందని, సీఎం సభకు రానివారికి ఆ పత్రాలపై సంతకాలు చేయబోమని హెచ్చరించారు. బస్సులో వచ్చిన వారికే రుణ మాఫీ జరుగుతుందని స్పష్టంచేశారు. దాంతో మహిళలు కొంతమంది తిట్టుకుంటూనే బస్సులు ఎక్కారు. అయినా చాలా బస్సులు పది నుంచి పదిహేను మందితోనే బయలుదేరి వెళ్లాయి. ఉత్తర నియోజకవర్గంలో సభకు తీసుకువెళ్లే మహిళల కోసం పోర్టు స్టేడియంలో బిర్యానీ తయారు చేయించి, ప్యాకెట్లు కట్టి పంపిణీ చేశారు. అయితే సీఎం జగన్ సాయంత్రం ఆరు గంటలకు వస్తారని, రాత్రి ఎనిమిది గంటల వరకు ఉండాలని అక్కడికి వెళ్లాక తెలియడంతో చాలా మంది ఆయన రాక ముందే తిరుగు ముఖం పట్టారు. వెళ్లిన బస్సులో వచ్చే అవకాశం లేకపోవడంతో సొంత డబ్బులు పెట్టుకొని ఆటోలలో ఇళ్లకు చేరుకున్నారు. ఇలా మహిళలు వెళ్లిపోతున్నారని గమనించిన నిర్వాహకులు స్టేడియంలో గేట్లకు తాళాలు వేసేశారు.

ప్రజల ఇక్కట్లు

విశాఖపట్నం రీజియన్‌లో ఆర్టీసీకి 820 బస్సులు ఉన్నాయి. వాటిలో 230 బస్సులు సీఎం సభకు కేటాయించడంతో చాలా రూట్లలో ... మిగతా 5వ పేజీలో

నరక ప్రయాణం!

పూర్తిగా ఛిద్రమైన వెంకటాపురం జంక్షన్- వాడనర్సాపురం రోడ్డు

- 12 కి.మీ.ల రహదారిలో అడుగడుగునా గోతులు



రాజకోడూరు జంక్షన్ సమీపంలో సగం రోడ్డు కోతకు గురై గోతులు ఏర్పడిన దృశ్యం

- నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్న వేలాది మంది ప్రయాణికులు
- నిర్వహణ పనులు చేపట్టని ఆర్అండ్‌బీ అధికారులు
- నేవల్ బేస్‌కు వచ్చే భారీ వాహనాలే కారణమని ఆరోపణ



కృష్ణంపాలెం జంక్షన్ వద్ద ఆనవాళ్లు లేని తారు రోడ్డు

రాంబిల్లి, ఫిబ్రవరి 13:

మండలంలో సగానికిపైగా పంచాయతీల ప్రజలతోపాటు ప్రత్యామ్నాయ నేవల్ బేస్ (ఎన్ఏవోబీ)కు రవాణాపరంగా ఎంతో ముఖ్యమైన వెంకటాపురం జంక్షన్- వాడనర్సాపురం రోడ్డు నిర్వహణను ఆర్అండ్‌బీ అధికారులు గాలికొదిలేశారు. సుమారు 12 కిలోమీటర్ల పొడవు వున్న ఈ రహదారిలో అడుగడుగునా గోతులు ఏర్పడి, పలుచోట్ల పూర్తిగా ఛిద్రమైంది. వర్షంపడితే గోతుల్లో నీరు చేరి పంట కుంటలను తలపిస్తుంటాయి. దీంతో రాత్రిపూట ద్విచక్ర వాహనాలు, ఆటోలు ప్రమాదాలకు గురవుతున్నాయిఇ. కాగా ఈ మార్గంలో పదికిపైగా పంచాయతీలు వున్నాయి. మండలంలో ఇతర పంచాయతీలకు చెందిన ప్రజలు వివిధ పనుల నిమిత్తం ఈ రోడ్డు మీదుగానే మండల కేంద్రానికి వచ్చి పోతుంటారు. ఇంకా ప్రత్యామ్నాయ నేవల్ బేస్‌లో నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టు కంపెనీల ఉద్యోగులు, కార్మికులు చుట్టుపక్కల ప్రాంతాల్లో వుంటూ ... మిగతా 6వ పేజీలో

నేడు జడ్పీ సమావేశం

విశాఖపట్నం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి):

విశాఖ జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు జడ్పీ హాలులో జరుగుతుందని సీఈవో ఎం.పోలినాయుడు తెలిపారు. ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జరగనున్న సమావేశానికి జిల్లాలో అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరుకావాలని కోరారు.

చెత్తమయంగా ఇందిరా మార్కెట్

పేరుకుపోతున్న కూరగాయలు, మాసం, చేపల వ్యర్థాలు

- సమీపంలోని ఇళ్లల్లో సేకరించిన చెత్త సైతం ఇక్కడే డంపింగ్
- చెత్తాచెదారం కుళ్లిపోయి తీవ్ర దుర్వాసన
- పట్టించుకోని మునిసిపల్ అధికారులు
- మార్కెట్ నిర్వహణ బాధ్యత మండల పరిషత్‌దని వెల్లడి



ఇందిరా మార్కెట్‌లో పేరుకుపోయిన చెత్త

నర్సీపట్నం, ఫిబ్రవరి 13:

స్థానిక ఇందిరా మార్కెట్‌లో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. చెత్తాచెదారం పేరుకు పోయి డంపింగ్ యార్డుని తలపిస్తున్నది. కుళ్లిన చెత్త నుంచి వస్తున్న దుర్గంధం భరించలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మాసం, చేపలు, కూరగాయల వ్యర్థాలను ఇక్కడే పడేస్తున్నారు. దీనికితోడు సమీపంలోని బొంతు వీధిలో ఇళ్ల నుంచి సేకరిస్తున్న తడి, పొడి చెత్తను పారిశుధ్య కార్మికులు ఇందిరా మార్కెట్లో డంప్ చేస్తున్నారు. అబీద్ సెంటర్‌లో పండ్లు, పూలు, ఆహార పదార్థాలను విక్రయించే వ్యాపారులు కూడా ఆయా వ్యర్థాలను ఇక్కడే పడేస్తున్నారు. మొత్తం మీద ఇందిరా మార్కెట్ ఒక మినీ డంపింగ్ యార్డుగా మారిందని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. చెత్తాచెదారం కుళ్లిపోయి భరించలేని దుర్వాసన వస్తున్నదని మార్కెట్‌కు వచ్చేవారితోపాటు షిరిడి సాయిబాబా గుడికి వచ్చే భక్తులు, ఎన్టీఆర్ మినీ స్టేడియానికి వచ్చే క్రీడాకారులు, మార్నింగ్ వాకింగ్ వచ్చేవారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే మునిసిపల్ అధికారులు, ముఖ్యంగా ప్రజారోగ్య శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా ఇందిరా మార్కెట్‌లో దుకాణాల నిర్వాహకుల ... మిగతా 6వ పేజీలో

ఇంటర్, పది పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు

అధికారులకు కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశం

- విద్య, పోలీసు, రెవెన్యూ శాఖలతో సమీక్ష
- ఇంటర్ పరీక్షలకు 28,621 మంది, టెన్త్ పరీక్షలకు 23,581 మంది..
- వివరాలు వెల్లడించిన డీవీఈవో, డీఈవోలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, వివిధ శాఖల అధికారులు

అనకాపల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి):

త్వరలో జరగనున్న పదో తరగతి, ఇంటర్మీడియట్, ఏపీపీఎస్సీ పరీక్షల నిర్వహణకు పటిష్ఠమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. పరీక్షల ఏర్పాట్లపై మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో విద్య, పోలీసు, రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మార్చి 18వ తేదీ నుంచి 27వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయన్నారు. ఇంకా ఓపెన్ స్కూల్ పరీక్షలు, ఉద్యోగాల భర్తీ కోసం ఏపీపీఎస్సీ పరీక్షలను కూడా సమర్థంగా నిర్వహించేందుకు ... మిగతా 6వ పేజీలో

మామిడి, జీడిమామిడి తోటలకు తెగుళ్లు

- వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి
- ఆలస్యం చేస్తే దిగుబడులపై ప్రభావం
- జిల్లా ఉద్యాన శాఖ అధికారి ప్రభాకరరావు

సబ్బవరం, ఫిబ్రవరి 13 : మామిడి, జీడిమామిడి తోటలు ప్రస్తుతం మొగ్గ, పూత దశల్లో వున్నాయి. రానున్న రోజుల్లో నాణ్యమైన, అధిక దిగుబడులు సాధించాలంటే రైతులు తోటలను నిరంతరం పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి జి.ప్రభాకరరావు సూచిస్తున్నారు. పూత, పిందె సమయంలో పొగమంచు, కీటకాలు, తెగుళ్ల కారణంగా దిగబడులు తగ్గిపోతాయని, ఇటువంటి వాటిని నివారించడానికి ఉద్యాన శాఖ సిబ్బంది సలహాలు, సూచనలు పాటించాలని అన్నారు. గత ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా ఈసారి పూత ఆలస్యంగా వస్తున్నదని, అందువల్ల రైతులు మరింత అప్రమత్తంగా వుండాలని ఆయన సూచిస్తున్నారు. మామిడి, జీడిమామిడి తోటలను ఆశించే తెగుళ్లు, నివారణ చర్యల గురించి జిల్లా ఉద్యాన శాఖ అధికారి ప్రభాకరరావు తెలిపిన వివరాలు..


మామిడి తోటలో తెగుళ్ల నివారణ మందును పిచికారీ చేస్తున్న రైతులు (ఫైల్ ఫొటో)


సబ్బవరం మండలం గుల్లేపల్లిలో మామిడి పూతను పరిశీలిస్తున్న జిల్లా జిల్లా ఉద్యాన అధికారి జి.ప్రభాకరరావు, సిబ్బంది


మామిడి తోటలో సస్యరక్షణ చర్యలు.. (ఫైల్ ఫొటో)

అనకాపల్లి జిల్లాలోని వివిధ మండలాల్లో 18 వేల ఎకరాల్లో మామిడి, సుమారు 60 వేల ఎకరాల్లో జీడిమామిడి తోటలు వున్నాయి. రైతులు సకాలంలో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చు. ఇందుకుగాను తోటలను రోజూ పరిశీలిస్తూ తెగుళ్లు, చీడపీడల లక్షణాలను గుర్తించి వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. పూత సమయంలో నీరు అధికంగా పెట్టకూడదు. పొటాషియం నైట్రేట్ ఎరువును లీటరు నీటికి 5 నుంచి 10 గ్రాముల వరకు నీటిలో కలిపి కొమ్మలన్నీ తడిచేలా పిచికారీ చేయడం వల్ల పూత బలంగా వుంటుంది.

మామిడి తోటల్లో...

తేనెమంచు పురుగు: ఇవి లేత ఆకులు, మొగ్గలు, పూత, కాడలమీద గుడ్లు పెడతాయి. వారం రోజుల వ్యవధిలో పిల్లలు వచ్చి ఆకులు, పిందెల నుంచి రసం పీల్చడం మొదలుపెడతాయి. ఆకులు నల్లగా మారిపోతాయి. పురుగులు విసర్జించిన తేనెవంటి పదార్థంపై నల్లని మసి ఏర్పడి, కిరణజన్య సంయోగక్రియ జరగక దిగుబడి పడిపోతుంది. తేనెమంచు పురుగుల నివారణకు పూత దశలో ఇమిడాక్లోప్రిడ్ లేదా తయోమిదాక్సమ్ మందును లీటరు నీటికి 0.6 మిల్లీలీటర్ల చొప్పున కలిపి పిచికారీ చేయాలి. పూత, మొగ్గ దశలో వుంటే లీటరు నీటికి అసిఫేట్ 1.5 గ్రాములు లేదా క్లోరిపైరిఫాస్ మందు రెండు మిల్లీలీటర్ల చొప్పున కలిపి పిచికారీ చేయాలి. తోటలు తెల్లపూత దశలో వుంటే ఎటువంటి మందులు పిచికారీ చేయకూడదు. పిందె దశలో వుంటే ఫిప్రొనిల్ మందును లీటరు నీటికి రెండు మిల్లీలీటర్ల చొప్పున కలిపి పిచికారీ చేయాలి. ఈ దశలో పిందె రాలకుండా ప్లానోఫిక్స్ మందును లీటరు నీటికి ఒక మిల్లీలీటర్ చొప్పున కలిపి పిచికారీ చేయాలి. తామర పురుగు: ఈ పురుగులు కోడిపేనుల మాదిగా చాలా చిన్నవిగా, గోధుమ రంగులో ఉండి కొత్త చిగుళ్లను, పిందెలను గోకి, గీరి రసాన్ని పీల్చడంతో ఆకులు కమిలిపోయినట్టుగా పిందెలపై మంగు ఏర్పడుతుంది. వీటి నివారణకు లీటరు నీటికి ఇమిడాక్లోప్రిడ్ మూడు మిల్లీలీటర్ల చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

బూడిద తెగులు: ఈ తెగులు రాత్రిళ్లు బాగా చల్లగా, పగటిపూట ఎండ అధికంగా ఉన్నపుడు ఆశిస్తుంది. పూత కాడలు, చిరు పిందెలపై తెల్లని పొడిలా ఏర్పడి బూజు పెరుగుతుంది. దీని వల్ల పూతకాడలు రాలిపోతాయి. ఈ తెగులు నివారణకు లీటరు నీటికి డినోకాప్ ఒక గ్రాము లేదా ట్రైడ్‌మార్ఫ్ ఒక గ్రామును కలిపి పిచికారీ చేయాలి.

కాయల రక్షణకు కవర్లు: మామిడి తోటల్లో కాయలు నిమ్మకాయ అంత పరిమాణానికి పెరిగిన తరువాత ప్రొటెక్టివ్ కవర్స్ కట్టినట్టయితే టెంక పుచ్చు పురుగును నివారించవచ్చు. టెంక పుచ్చు పురుగు ఆశిస్తే కాయలు సరిగా ఎదగా, కోత కోసిన తరువాత కుళ్లిపోయి నాణ్యత కోల్పోతాయి. దీనివల్ల మార్కెట్‌లో సరైన ధర లభించక రైతు నష్టపోయే అవకాశం వుంది.

జీడిమామిడి తోటల్లో...

జీడిమామిడి తోటలు ప్రస్తుతం పూత దశలో వున్నాయి. కొద్ది రోజులుగా తెల్లవారుజాము నుంచి ఉదయం ఎనిమిది గంటల వరకు పొగమంచు దట్టంగా కురుస్తున్నది. దీనివల్ల పూత మాడిపోవడమే కాకుండా పలు రకాల కీటకాలు, తెగుళ్లు ఆశిస్తాయి. ముఖ్యంగా అధిక మంచు కారణంగా టీ దోమ ఆశిస్తాయి. టీ దోమ: ఈ దోమల తల్లి, పిల్ల పురుగులు చెట్టు లేత కొమ్మలను ఆశించి రసం పీల్చడం వల్ల ఎర్రని జిగురు కారిపోయి రెమ్మలపై నల్లని పొడవైన నూలు కండె ఆకారపు మచ్చలు ఏర్పడతాయి. దీని వల్ల పూత, పిందె మాడిపోయి దిగుబడి తగ్గుతుంది. పూత వచ్చిన తోటల్లో లీటరు నీటికి 0.6 మి.మీ.ల లామ్డా-సైహలోత్రిన్ లేదా 2 మి.మీ.ల క్లోర్‌పైరిఫాస్ కలిపి పిచికారీ చేసుకోవాలి. పూత దశ నుంచి పిందె కట్టి బఠాణీ గింజ సైజులో ఉన్నప్పుడు లీటరు నీటికి 2 మి.మీ.ల ప్రొఫెనోఫాస్ మందును కలిపి పది నుంచి 25 రోజుల వ్యవధిలో పురుగుల ఉధృతినిబట్టి పిచికారీ చేసుకోవాలి. మార్చి నెలాఖరు వరకు పూత, పిందె దశల్లో రెండు నుంచి మూడుసార్లు పిచికారీ చేస్తే టీ దోమ అదుపులో ఉంటుంది.

ఖాజీపాలెం సచివాలయానికి తాళాలు

- ఉదయం గంటపాటు ఉండి వెళ్లిపోయిన మహిళా పోలీసు
- ఆచూకీ లేని వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లు
- క్షేత్రస్థాయి విధుల్లో వెల్‌నెస్ సెంటర్ అధికారి
- సెలవులో పంచాయతీ సెక్రటరీ


ఒక్క ఉద్యోగి కూడా లేని ఖాజీపాలెం సచివాలయం (ఇన్‌సెట్‌లో) తాళం వేసి ఉన్న సచివాలయం

అచ్యుతాపురం, ఫిబ్రవరి 13: గ్రామ సచివాలయంలో విధులు నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో వుండాలన్న ప్రభుత్వ ఆదేశాలను మండలంలోని ఖాజీ పాలెం సచివాలయం ఉద్యోగులు బేఖాతరు చేస్తున్నారు. విధులకు సరిగా హాజరుకాకపోవడం, ఒకవేళ వచ్చినా.. కొద్దిసేపు వుండి బయటకు వెళ్లిపోవడం ఆనవాయితీగా మారింది. దీంతో వివిధ పనుల నిమిత్తం సచివాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఖాజీపాలెం గ్రామ సచివాలయంలో వివిధ విభాగాలకు సంబంధించి 11 మంది ఉద్యోగులు వున్నారు. మంగళవారం ఉదయం పది గంటలకు మహిళా పోలీస్ వానీషా వచ్చి కార్యాలయం తాళాలు తీశారు. ఆమె జగ్గన్నపేట సచివాలయంలో విధులు కూడా అప్పగించారు. మరో గంట వరకు సిబ్బంది ఎవరూ రాలేదు. దీంతో ఆమె 11 గంటలకు ఖాజీపాలెం సచివాలయానికి తాళాలు వేసి జగ్గన్నపేట సచివాలయానికి వెళ్లిపోయారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ గౌస్ గ్రామ సచివాలయం భవనం పనిపై అచ్యుతాపురం వెళ్లారు. వెల్‌నెస్ సెంటర్ అధికారి ఉదయం తొమ్మిది గంటలకు వచ్చి వైద్య సేవలు నిమిత్తం బయటకు వెళ్లిపోయారు. వ్యవసాయ సహాయకుని పోస్టు ఖాళీగా ఉంది. పంచాయతీ కార్యదర్శి సెలవు పెట్టారు. ఏఎన్ఎం శిక్షణలో వున్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్ నరేశ్, డిజిటల్ అసిస్టెంట్ ఎందుకు రాలేదో తెలియదు. వివిధ పనులపై వచ్చిన వారు సచివాలయానికి తాళం వేసి వుండడంతో తిరిగి వెళ్లిపోయారు.

టీడీపీ-జనసేన కూటమి గెలుపే లక్ష్యం

- మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు పిలుపు
- అనిత నివాసంలో సమావేశానికి హాజరైన అసమ్మతి నేతలు


మాజీ మంత్రి గంటా సమక్షంలో చేతులు కలిపి ఐక్యతను చాటుతున్న టీడీపీ నేతలు

నక్కపల్లి, ఫిబ్రవరి 13: రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం- జనసేన కూటమి గెలుపే లక్ష్యంగా టీడీపీ శ్రేణులంగా కలిసికట్టుగా పనిచేయాలని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు సూచించారు. పాయకరావుపేట అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన కొంతమంది టీడీపీ నాయకులు, తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత నిర్వహించే కార్యక్రమాలకు హాజరుకాకుండా ఆమెకు దూరంగా వుంటున్నారు. అనిత ఈ విషయాన్ని ఇటీవల గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లడంతో మంగళవారం అనిత నివాసంలో ఏర్పాటు చేసే సమావేశానికి రావాలని ఆయా నేతలకు వర్తమానం పంపినట్టు తెలిసింది. దీంతో పాయకరావుపేట నియోజకవర్గంలో అన్ని మండలాలకు చెందిన నేతలతోపాటు అసమ్మతి నాయకులు మజ్జూరి నారాయణరావు, గొర్లె రాజబాబు, నక్కపల్లి మండలానికి చెందిన బాబ్జీ, తదితరులు ఈ సమావేశానికి వచ్చారు. తనకు ఎవరూ విరోధులు కారని, అందరితోనూ సఖ్యతగానే వుంటానని ఈ సందర్భంగా అనిత చెప్పారు. దీంతో నాలుగు మండలాల టీడీపీ అధ్యక్షులు, జడ్పీటీసీ మాజీ సభ్యులు, ఇతర నాయకులు మాట్లాడుతూ.. గంటా శ్రీనివాసరావు, వంగలపూడి అనిత నేతృత్వంలో రానున్న ఎన్నికల్లో పాయకరావుపేట నుంచి టీడీపీ-జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థిని గెలిపించుకుంటామని హామీ ఇచ్చారు. మజ్జూరి నారాయణరావు, గొర్రెల రాజబాబుపై గతంలో విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేసేలా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుతో మాట్లాడుతానని అనిత వారికి హామీ ఇచ్చారు.

సిద్ధాశ్రమంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

అచ్యుతాపురం, ఫిబ్రవరి 13: మండలంలోని నునపర్తి హరిహర పంచాయతన క్షేత్రం (సిద్ధాశ్రమం)లో బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉదయం సుబ్రహ్మణ్యస్వామి, సుదర్శన స్వాములకు అభిషేకాలు, అష్టోత్తాలతోపాటు సుదర్శన యాగం, సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మన్యుసూక్తం, నవగ్రహాలతోపాటు లక్ష్మీగణపతి హోమాది కార్యక్రమాలు జరిగాయి. బుధవారం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి కల్యాణం జరుపుతామని నిర్వాహకులు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు గిండికోట వేంకట బ్రహ్మ శ్రీనివాస శర్మ, దిగుదాడి రుద్రయ్య, శరభయ్య, బొజ్జా అప్పారావు, కాకర అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రైతుల ధర్నా

మునగపాక, ఫిబ్రవరి 13: వ్యవసాయదారులకు అందించే ఏజియల్ విద్యుత్‌ను తొమ్మిది గంటల నుంచి ఏడు గంటలకు కుదించడాన్ని నిరసిస్తూ బుధవారం ఉదయం 9 గంటలకు స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలుగు రైతు రాష్ట్రకార్యదర్శి దాడి ముసిలినాయుడు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలలోని రైతు సంఘాలు, రైతులు పార్టీలకతీతంగా ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొవాలని కోరారు. రైతులు అధిక సంఖ్యలో కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

ప్రయాణికులతో ఆడుకున్నారు

... 3వ పేజీ తరువాయి

ఉదయం నుంచే బస్సులు రద్దయ్యాయి. ఈ విషయం తెలియక రెగ్యులర్‌గా ఆ మార్గాల్లో ప్రయాణించేవారు బస్సుల కోసం బస్టాపులో గంటల తరబడి నిరీక్షించారు. ఎంతకీ బస్సులు రాకపోవడంతో విషయం తెలుసుకుని కొందరు ఆటోలను ఆశ్రయించారు. ఆర్టీసీ కాంప్లెక్స్, గురుద్వారా, అక్కయ్యపాలెం, గాజువాక, సింహాచలం, పోస్టాఫీసు జంక్షన్ తదితర ప్రాంతాల్లో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.


విశాఖ ద్వారకా కాంప్లెక్స్ వద్ద బస్సుల కోసం వేచి ఉన్న విద్యార్థులు

బహుమతులిచ్చే కార్యక్రమానికి మమ్మల్ని ఎందుకు తీసుకొచ్చారు?

- పోలీసులను ప్రశ్నించిన మహిళలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆటల్లో బహుమతులిచ్చే కార్యక్రమానికి తమను ఎందుకు తీసుకువచ్చారంటూ 'ఆడుదాం ఆంధ్రా' ముగింపు వేడుకలకు వచ్చిన మహిళలు కొందరు పోలీసులను ప్రశ్నించారు. నగరంలోని డ్వాక్రా సంఘాల మహిళలను బస్సుల్లో ముగింపు వేడుకలు జరిగే స్టేడియం వద్దకు సాయంత్రం నాలుగు గంటలకే తరలించారు. సాయంత్రం ఆరు గంటలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అక్కడకు వచ్చేంత వరకూ వారిని గ్యాలరీల్లో కూర్చోవాలంటూ వారి ప్రాంతాలకు సంబంధించిన వలంటీర్లు, ఆర్పీలు ఆదేశించారు. తీరా అక్కడకు వెళ్లిన తర్వాత ఆటల పోటీల్లో గెలిచిన వారికి బహుమతులు ప్రదానం చేసే కార్యక్రమం అని తెలుసుకున్నారు. పైగా గంటల తరబడి గ్యాలరీల్లో కూర్చోలేక బయటకు వెళ్లిపోయేందుకు సీట్లలో నుంచి లేచారు. వారంతా బయటకు వెళ్లిపోతుండడంతో అక్కడున్న పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. 'ఎవరికో బహుమతులు ఇచ్చేదానికి మేమందుకంటూ' తమ అసహనాన్ని వ్యక్తంచేశారు. దీంతో పోలీసులు కొందరు తమకెందుకొచ్చిన తలనొప్పి అన్నట్టు వారికి అడ్డు తప్పుకోగా, మరికొందరు మాత్రం గ్యాలరీ నుంచి బయటకు వచ్చే గేట్లకు తాళాలు వేయడం కనిపించింది. సీఎం జగన్ స్టేడియంకు రాకముందే చాలామంది మహిళలు నడుచుకుంటూ జాతీయ రహదారిపైకి వెళ్లి ఆటోల్లో తమ ఇళ్లకు వెళ్లిపోయారు. మరికొందరు తమ బస్సులు పార్కింగ్ చేసిన చోటకు వెళ్లిపోవడం విశేషం.

క్రైం... crime news

మహిళ మెడలోని బంగారం పుస్తెల తాడు తస్కరణ

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 13: పట్టణంలోని పూల్‌బాగ్‌రోడ్డులో భర్తతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళుతున్న మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు బంగారం పుస్తెల తాడును తెంచుకుని పారిపోయారు. పట్టణ ఎస్ఐ మహ్మద్ అలీ తెలిపిన సమాచారం మేరకు.. తుమ్మపాల గ్రామానికి చెందిన రాపేటి సరస్వతి గవరపాలెం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. సోమవారం సాయంత్రం పాఠశాల విడిచిపెట్టిన తరువాత తన భర్త శ్రీనివాసరావుతో కలిసి ద్విచక్ర వాహనంపై పూల్‌బాగ్ రోడ్డు మీదుగా ఇంటికి వెళుతున్నారు. వెనుక నుంచి బైక్‌పై వస్తున్న ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు.. సరస్వతి మెడలో వున్న మూడు తులాల బంగారం పుస్తెలతాడును తెంచుకుని పారిపోయారు. అనంతరం శ్రీనివాసరావు పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 13: ప్రమాదవశాత్తూ మేడ మెట్ల పైనుంచి జారి పడడంతో తీవ్రంగా గాయపడి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మహిళ మంగళవారం ఉదయం మృతి చెందినట్టు పట్టణ ఏఎస్ఐ మణికుమారి తెలిపారు. ఆమె వెల్లడించిన వివరాల ప్రకారం.. పట్టణంలోని కోట్నివీధి ప్రాంతంలో పోతంశెట్టివారివీధికి చెందిన వీసం వరలక్ష్మి(54) ఈ నెల మూడో తేదీ సాయంత్రం డాబా మెట్లను నీటితో శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తూ జారి పడిపోయింది. తలకు దెబ్బ తగలడంతో. చెవి నుంచి రక్తం కారింది. కుటుంబ సభ్యులు తొలుత ఎన్టీఆర్ వైద్యాలయానికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సిఫారసు మేరకు విశాఖ కేజీహెచ్‌కు తరలించారు.. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందింది. భర్త రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ మణికుమారి చెప్పారు.

కిలోన్నర గంజాయితో ఇద్దరు యువకుల అరెస్టు

కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 13: కిలోన్నర గంజాయితో పట్టుబడిన ఇద్దరు యువకులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు కృష్ణాదేవిపేట ఎస్ఐ ఎం.ఉపేంద్ర తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మంగళవారం గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట పీహెచ్‌సీ సమీపంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టు వద్ద తెలంగాణ రాష్ట్రం భోపాలపల్లికి చెందిన బోల్లా అనిల్, బోనగిరి యుగంధర్ కాలినడకన బ్యాగులతో వెళుతున్నారు. వారిపై అనుమానం వచ్చి ఎస్ఐ తన సిబ్బందితో తనిఖీ చేయగా కిలోన్నర గంజాయి ప్యాకెట్లు ఉన్నట్టు గుర్తించారు. దీంతో వారి వద్ద ఉన్న గంజాయి, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్టు ఎస్ఐ తెలిపారు.

ఉపాధ్యాయిని ఆత్మహత్య

విశాఖపట్నం, ఫిబ్రవరి 13: ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన స్థానిక అంబేడ్కర్ కాలనీలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పరవాడ మండలం మంగళపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న కె.ఝాన్సీరాణి (43) ఇక్కడి అంబేడ్కర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఆమె భర్త 2022లో అనారోగ్యంతో మృతి చెందడం, పిల్లలు కూడా లేకపోవడంతో నిత్యం మానసిక ఆవేదనకు గురయ్యేవారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి వాష్ రూమ్‌కు వెళ్తానని చెప్పిన ఝాన్సీరాణి ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు బలవంతంగా తలుపులు తెరిచారు. వాష్ రూమ్‌లోని హుక్కుకు ఉరి వేసుకుని మృతి చెందిన ఆమెను చూసి చుట్టుపక్కల వారికి ఈ విషయాన్ని తెలియజేశారు. అనంతరం కుటుంబ సభ్యులు మల్కాపురం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఝాన్సీరాణి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి ఎస్ఐ దేవుడమ్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

738 కిలోల గంజాయి స్వాధీనం

- ఒకరి అరెస్టు


పట్టుబడిన గంజాయితో ఎస్ఈబీ అధికారులు

పాడేరురూరల్, ఫిబ్రవరి 13: మన్యం నుంచి మైదాన ప్రాంతానికి వ్యాన్‌లో తరలిస్తున్న 738 కిలోల గంజాయిని మంగళవారం సాయంత్రం స్వాధీనం చేసుకొని, ఓ వ్యక్తిని అరెస్టు చేశామని జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ఎస్ఈబీ సీఐ, డీటీఎఫ్ సీఐ, సిబ్బంది మంగళవారం సాయం త్రం మండలంలోని చింతలవీధి జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో అటుగా వస్తున్న వ్యాన్‌ను ఆపి తనిఖీ చేయగా అందులో 738 కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించారు. గంజాయిని స్వాధీనం చేసుకొని, వాహన డ్రైవర్ పాంగి గురును అరెస్టు చేసి వాహనాన్ని సీజ్ చేశారు. నిందితుడు ఒడిశా రాష్ట్రం జోలాపుట్టు నివాసిగా గుర్తించారు. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు గంజాయితో సంబంధం ఉన్న జోలాపుట్టు ప్రాంతానికి చెందిన మరో నలుగురు వ్యక్తులను గుర్తించామని, వారిని విచారణ చేస్తున్నట్టు ఎన్‌ఫోర్స్ మెంట్ సూపరింటెండెంట్ తెలిపారు. పట్టుబడిన గంజాయి, వాహనం, నిందితుడిని ఎస్ఈబీ స్టేషన్‌కు అప్పగించామన్నారు. ఈ తనిఖీల్లో ఎస్ఈబీ, డీటీఎఫ్ అధికారులు సతీశ్‌కుమార్, శేఖర్‌బాబు, సురేశ్‌కుమార్, దస్తగిరి, ఎస్ఈబీ సిబ్బంది రామకృష్ణ, నాయుడు పాల్గొన్నారు.

శుక శ్యామలా రూపంలో శ్యామా అమ్మవారు


శుక శ్యామలా రూపంలో అమ్మవారు

సబ్బవరం, ఫిబ్రవరి 13: మండలంలోని దేవీపురంలో శ్యామా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు మంగళవారం శుక శ్యామా రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారు చదుష్ట కళలకు అధిష్ఠాన దేవత అయినందున లలిత కళల్లో ప్రావీణ్యత కోరేవారు, అభివృద్ధిని కాంక్షించేవారికి నేటి అమ్మవారి దర్శనం అద్భుత ఫలాలను ఇస్తుందని గురుపత్ని అన్నపూర్ణమ్మ భక్తులకు వివరించారు. మధ్యాహ్నం భక్తులకు ఉచిత అన్నప్రసాద సంతర్పణ జరిగింది. కార్యక్రమంలో శ్రీవిద్య ట్రస్టు నిర్వాహకులు కందర్ప ప్రభాకర్, రమా, భక్తులు పాల్గొన్నారు.

డీఐజీ విశాల్ గున్నీని కలిసిన ఏఎస్పీలు


డీఐజీతో సమావేశమైన పోలీసు అధికారులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 13: విశాఖ రేంజ్ డీఐజీగా బాధ్యతలు చేపట్టిన విశాల్ గున్నీని మంగళవారం పలువురు అదనపు ఎస్పీలు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీఐజీ అల్లూరి సీతారామరాజు, మన్యం పార్వతీపురం జిల్లాల అధికారులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో చింతూరు, అనకాపల్లి, శ్రీకాకుళం, రంపచోడవరం, పాడేరు, పార్వతీపురం సబ్ డివిజన్ అదనపు ఎస్పీలు రాహుల్‌మీనా, పి.సత్యనారాయణ, ప్రేమకాజల్, కె.ధీరజ్, జగదీష్ అడహళ్లి, సునీల్ షరోన్ పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	117.00
లైవ్ ధర	137.00
విత్ స్కిన్	244.00
స్కిన్ లెస్	254.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

ఏపీఐఐసీ జడ్‌ఎంపై చర్యలు తీసుకోవాలి: బండారు డిమాండ్

పరవాడ, ఫిబ్రవరి 13: పరవాడ రెవెన్యూ పరిధి సర్వే నంబరు 11లో గ్రావెల్ అక్రమ తవ్వకాలకు వినియోగించిన ఎక్స్‌కవేటర్, గ్రావెల్ రవాణాకు ఉపయోగించిన డంపర్ లారీలకు అపరాధ రుసుము విధించిన అధికారులు.. గ్రావెల్ తవ్వకాలకు పురమాయించిన ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌పై చర్యలు ఎందుకు తీసుకోలేదని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ప్రశ్నించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు పేరుతో గ్రావెల్ అక్రమ తవ్వకాలు, తరలింపునకు ప్రోత్సహించిన ఆయనపై చర్యలు తీసుకోవడంలో జిల్లా ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని మండిపడ్డారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ స్పందించి, గ్రావెల్ అక్రమ తవ్వకాలకు కారకులైన ఏపీఐఐసీ జడ్‌ఎంపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని బండారు డిమాండ్ చేశారు.

గ్రావెల్ తరలింపు వాహనాలకు అపరాధ రుసుము

పరవాడ, ఫిబ్రవరి 13: పరవాడ రెవెన్యూ పరిధి సర్వే నంబరు 11లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు, రవాణాలకు వినియోగించిన వాహనాలకు రూ.90,440 అపరాధ రుసుము విధించినట్టు గనుల శాఖ ఏడీ టి.సుబ్బారాయుడు తెలిపారు. ఎక్స్‌కవేటర్‌కు రూ.50 వేలు, నాలుగు డంపర్ లారీలకు ఒక్కోదానికి రూ.10,110 చొప్పున పెనాలిటీ విధించగా ఎం.శ్రీనివాస్ అనే వ్యక్తి నగదు చెల్లించినట్టు ఆయన వెల్లడించారు. అపరాధ రుసుము వాహనాలకు మాత్రమేనని, గ్రావెల్ తవ్విన ప్రదేశాన్ని రెండు, మూడు రోజుల్లో తమ సిబ్బంది పరిశీలించి కొలతలు వేస్తారని, ఆ మేరకు అపరాధ రుసుము వసూలు చేస్తామని ఏడీ వెల్లడించారు.

వైసీపీ నాయకుల అండతో భూ ఆక్రమణ!

- బాధిత కుటుంబం ఆందోళన

రావికమతం, ఫిబ్రవరి 13: వైసీపీ నాయకుల అండతో ఓ వడ్డీ వ్యాపారి తమ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నాడని ఓ కుటుంబం ఆరోపించింది. వారి నుంచి తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని నమ్మి కొండమ్మ కుటుంబ సభ్యులు మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా కొండమ్మ మాట్లాడుతూ తట్టబంద పంచాయతీ శివారు బూరుగుపాలెం రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 63/4లో 62 సెంట్ల మెట్ట భూమిని తనకు పుట్టింటి వారు ఇచ్చారని చెప్పింది. మద్యానికి బానిసైన తన భర్త రామునాయుడు పరవాడకు చెందిన సత్యనారాయణ అనే వడ్డీ వ్యాపారి వద్ద రూ.రెండు లక్షలు అప్పుగా తీసుకున్నాడని తెలిపింది. బాకీ చెల్లించడంలో జాప్యం జరగడంతో ఆ వడ్డీ వ్యాపారి వైసీపీ నాయకుల అండతో ఆ భూమిని అతని పేరున రిజిస్ట్రేషన్ చేయించేసుకున్నాడని ఆరోపించింది. ఆ భూమి వారిదని, ఖాళీ చేయాలని బెదిరిస్తున్నారని చెప్పింది. దీనిపై ఈ నెల 5న జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్టు తెలిపింది. ఈ భూమికి నలుగురు వారసులు ఉంటే వారికి సంబంధం లేకుండా ఎలా రిజిస్ట్రేషన్ చేయించారని నిలదీసింది. మంగళవారం ఆ భూమిలో సిమెంట్ స్తంభాలు పాతడానికి వచ్చిన వడ్డీ వ్యాపారి చేసిన ప్రయత్నాన్ని కొండమ్మ కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు.

ఉపమాకలో 'బచ్చలమల్లి' సినిమా షూటింగ్


'బచ్చలమల్లి' సినిమా సన్నివేశాలను చిత్రీకరిస్తున్న దృశ్యం

నక్కపల్లి, ఫిబ్రవరి 13: హాస్య మూవీస్ బ్యానర్‌పై అల్లరి నరేశ్ హీరోగా నిర్మిస్తున్న 'బచ్చలమల్లి' సినిమా షూటింగ్‌ను మంగళవారం మండలంలోని ఉపమాక గ్రామంలో ప్రారంభించారు. బి.సుబ్బు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా రెండో షెడ్యూల్‌లో భాగంగా ఉపమాక ఆలయ పరిసరాల్లో గ్రామీణ వాతావరణం, తిరునాళ్లకు సంబంధించిన సన్నివేశాలను చిత్రీకరించారు. కాగా సినిమా షూటింగ్‌ను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. ప్రస్తుతం హీరో అల్లరి నరేశ్ కాకుండా ఇతర నటీనటులకు సంబంధించిన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నామని, తరువాత జరిగే షూటింగ్‌లో అతను పాల్గొంటారని దర్శకుడు సుబ్బు తెలిపారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 13: మండలంలోని గోకులపాడు పోలింగ్ కేంద్రాల వద్ద మంగళవారం డీటీ శ్యామ్ ఈవీఎం వినియోగంపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీటీ ఈవీఎంల ద్వారా ఓటు ఎలా వేయాలి.. వేసిన ఓటు అనుకున్న గుర్తుకు పడిందా.. లేదా.. అనేది ఎలా చూడాలనే దానిపై ఓటర్లకు అవగాహన కల్పించారు.

పేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు

అనకాపల్లిటౌన్, ఫిబ్రవరి 13 : స్థానిక ఏఎంఏఎల్‌ రోటరీ కంటి ఆస్పత్రిలో మంగళవారం పేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించారు. ఆస్పత్రికి సోమవారం 29 మంది పేదలు కంటి సమస్యపై రాగా వారికి నేత్ర వైద్యసహాయకులు పి.దేవి పరీక్షలు నిర్వహించారని ఆస్పత్రి చైర్మన్ రవిరాం జవహర్ తెలిపారు. వీరిలో ఎనిమిది మందికి ఆపరేషన్లు పడతాయని గుర్తించి, మంగళవారం డాక్టర్ కె.మల్లేశ్వరరావు ఐఓఎల్ కంటి ఆపరేషన్లు నిర్వహించారన్నారు. కె.అరుణకుమార్ ఆపరేషన్ చేయించుకున్న వారికి మందులను ఉచితంగా అందజేశారని ఆయన తెలిపారు.

111వ రోజుకు చేరిన పెదకలవలాపల్లి రైతుల దీక్షలు

రాంబిల్లి, ఫిబ్రవరి 13 : రక్షణ శాఖకు అప్పగించిన అటవీ భూములు చుట్టూ నిర్మించే ప్రహరీ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలంటూ పెదకలవలాపల్లి రైతులు చేపట్టిరిలే దీక్షలు మంగళవారానికి 111వ రోజుకు చేరుకున్నాయి. ఈ ప్రహరీ వల్ల తమ పంట భూములకు వెళ్లే దారులు మూసుకుపోతున్నాయని వారు ఆందోళనకు దిగారు. జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కర్రి అప్పారావు రిలే దీక్షా శిబిరాన్ని సందర్శించి రైతులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యులు ఆర్.దేముళ్ల ఉన్నారు.

డ్వాక్రా మహిళలు స్వయం సమృద్ధిని సాధించాలి

ఎలమంచిలి, ఫిబ్రవరి 13: డ్వాక్రా సంఘాల సభ్యులంతా స్వయం సమృద్ధిని సాధించే దిశగా ముందడుగు వేసి ఆర్థిక పుష్టిని సాధించాలని డీఆర్‌డీఏ పీడీ శశిదేవి అన్నారు. మంగళవారం లైనుకొత్తూరు మహిళా సమైఖ్య కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు ఆదాయ వనరులు పెంపొందించుకునేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. అనంతరం ఆరోగ్యశ్రీ, ఎన్నికల కమిషన్‌కు సంబంధించిన యాప్‌లను డౌన్‌లోడ్ చేయించారు. లైనుకొత్తూరు ప్రధాన వీధుల్లో రహదారి భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ మండల ప్రతినిధి రాణి, సిబ్బంది పాల్గొన్నారు.












లోకేశ్ సభకు ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న అనిత

లోకేశ్ శంఖారావం సభకు చురుగ్గా ఏర్పాట్లు

కోటవురట్ల, ఫిబ్రవరి 13: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం సభకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు వంగలపూడి అనిత మంగళవారం మండలంలోని కైలాసపట్నంలో స్థలాన్ని పరిశీలించారు.ఈనెల 21వ తేదీన పాయకరావుపేట నియోజకవర్గంలో పర్యటన ఖరారు అయ్యింది. ఈనెల 20వ తేదీన నర్సీపట్నంలో శంఖారావం బహిరంగ సభ ముగించుకొని లోకేశ్ అదే రోజు రాత్రి మండలంలోని కైలాసపట్నంలో బస చేయనున్నారు. ఈనెల 21వ తేదీ ఉదయం శంఖారావం సభలో పాల్గొంటారని వంగలపూడి అనిత తెలిపారు.

లోకేశ్ శంఖారావం సభను విజయవంతం చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆమె వెంట టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు జానకి శ్రీనివాసరావు, తిరుమలరావు, పెట్ల నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

వివాహ వివరాలు నమోదులో పోలీసులు సహకరించాలి

»బాలల హక్కుల కమిషన్ సభ్యుడు సీతారామ్

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 13 : రాష్ట్రంలో వివాహ వివరాలు ముందస్తు నమోదు జరిగేలా పోలీసులు సహకరించాలని బాలల హక్కుల కమిషన్ సభ్యుడు సీతారామ్ కోరారు. స్థానిక పోలీస్ అతిథిగృహంలో మంగళవారం జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ అనంతలక్ష్మి అధ్యక్షతన బేటి బచావో.. బేటీ పడావో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీతారామ్ మాట్లాడుతూ.. బాల్య వివాహాల నివారణకు ప్రభుత్వశాఖలు సమరశంఖం పూరించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మినహా మిగతా జిల్లాల్లో హెచ్చు తగ్గుల మధ్య బాల్య వివాహాల పరంపర కొనసాగుతుందన్నారు. ఐసీడీఎస్ పీడీ కె. అనంతలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాల నిలుపుదలలో అన్ని ప్రభుత్వశాఖల శ్రమ, కృషి ఒక ఎత్తు అయితే ఒక్క పోలీస్ అధికారుల చొరవ మరో ఎత్తు అని అన్నారు. దిశ మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ ఎం. ఉపేంద్రబాబు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్‌ల్లో బాలల స్నేహపూర్వక వాతావరణం కలిగేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రొబేషనరీ అధికారి ఎం.శరత్‌బాబు, ఉమ్మడి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు సూర్యనారాయణ, డాక్టర్ లూసీ, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీతారామ్

టీచర్ల నియామకాల్లో అప్రెంటిస్ విధానం దుర్మార్గం

»డీఎస్సీ నోటిఫికేషన్ ప్రతులు దహనం చేసిన యూటీఎఫ్ నేతలు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 13 : రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో అప్రెంటిస్ విధానాన్ని ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ మంగళవారం సీఐటీయూ కార్యాలయం వద్ద యూటీఎఫ్ నాయకులు నోటిఫికేషన్ కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ సుదీర్ఘకాలం పోరాడి అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేయించుకున్నామన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో అప్రెంటిస్ విధానాన్ని తిరిగి పునరిద్ధరించడం అన్యాయమన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయగా ఇప్పుడు ఆయన కుమారుడు జగన్ మళ్లీ ఈ అప్రెంటిస్ విధానాన్ని అమలు చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, జీకేఆర్ స్వామి, అలవేలు, బాబురావు, రాజునాయుడు, దేముడు నాయుడు, సతీష్, శ్రీను, ఎంవీ అప్పారావు, సలీం తదితరులు పాల్గొన్నారు.


నోటిఫికేషన్ పత్రాలను దహనం చేస్తున్న ఉపాధ్యాయులు

ఆశువు జ్యోతిష్యుడు మణిశ్రీ శర్మకు సన్మానం

కొత్తూరు, ఫిబ్రవరి 13 : జ్యోతిష్యంలో కొత్త వరవడి సృష్టించిన మణి శ్రీ శర్మను అనకాపల్లి పరశురామ బ్రాహ్మణ సేవా సంఘం కమిటీ, గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు సన్మానించారు. మంగళవారం స్థానిక శారదా నది ఒడ్డున ఉన్న ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు పేరూరు భోగలింగేశ్వరశర్మ (బుజ్జి స్వామి) మాట్లాడుతూ.. ఇతరులు మాట్లాడే మాటలు.. అడిగే ప్రశ్నలు.. క్షణాల్లో వారి చరిత్ర, జాతకం ఆశువుగా చెప్పడం ఇది కొత్త వింతగా ఉందన్నారు. చెన్నైకు చెందిన గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ డాక్టరేట్ ఇచ్చి గౌరవించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి పరశురామ బ్రాహ్మణ సేవా సంఘం మండల అధ్యక్షుడు జయంతి నాగలింగం, గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు గౌరీపతి, అర్చకులు రఘు, పూజ్యం నాగబాబు, చావలి రమేష్, తనికెళ్ల రామకృష్ణ, రవి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


మణిశ్రీ శర్మను సత్కరిస్తున్న బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు

శ్రీచైతన్యలో ఘనంగా స్పోర్ట్స్ మీట్

పాయకరావుపేట, ఫిబ్రవరి 13: స్థానిక శ్రీచైతన్య టెక్నో స్కూల్లో మంగళవారం స్పోర్ట్స్ మీట్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ అంశాల్లో నిర్వహించిన ఆటల పోటీలు అందరినీ ఆకట్టుకున్నాయి. పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ఆంధ్ర రాష్ట్ర అత్యాపాత్య అసోసియేషన్ అధ్యక్షులు కె.జాబెజ్ చేతుల మీదుగా పతకాలు, ప్రశంసాపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల ఏజీఎం సురేష్, ఆర్ఐ గోపీనాథ్, ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు, సిబ్బంది వెంకటరమణ, విజయ్, లోవేశ్, ప్రైమరీ ఇన్‌చార్జులు వేణిప్రియ, కల్పన, గౌరీ, పీఈటీలు గణేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేసిన దృశ్యం

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : సీఐ

అచ్యుతాపురం, ఫిబ్రవరి 13: ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలు అరికట్టాలని సీఐ బుచ్చిరాజు అన్నారు. మంగళవారం బ్రాండిక్స్ డ్రైవర్లతో తర్వాత అచ్యుతాపురంలో ఆటో డ్రైవర్లతో నిర్వహించిన అవగాహన సదస్సుల్లో ఆయన మాట్లాడుతూ పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురంలో విపరీతంగా ట్రాఫిక్ పెరిగిందని, అందువల్ల డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. డ్రైవర్లు ఆరునెలలకొకసారి కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కర్మాగారాలకు కార్మికులను తీసుకువచ్చే బస్సు డ్రైవర్లు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈసమావేశంలో ఎస్ఐ నారాయణరావు పాల్గొన్నారు. అలాగే వెలుగు ఏపీఓ చినతల్లి ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై డ్వాక్రా మహిళలు మానవహారంగా ఏర్పడి రోడ్డు భద్రత గురించి వివరించారు.


మాట్లాడుతున్న సీఐ బుచ్చిరాజు

డైట్‌లో ప్రపంచ రేడియో దినోత్సవం

అనకాపల్లిటౌన్, ఫిబ్రవరి 13 : స్థానిక డైట్ కళాశాలలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ రేడియో దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ప్రజలపై పెరిగిన ప్రభావం దృష్టిలో పెట్టుకుని ఐక్యరాజ్య జనరల్ అసెంబ్లీ ఫిబ్రవరి 13న ప్రపంచ రేడియో డే గా ప్రకటించిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. వైకుంఠరావు, డీన్ అకాడమిక్స్ డాక్టర్ కె. పార్వతి, డాక్టర్ పూర్ణప్రియా, బి. శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.











పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి

తుమ్మపాల, ఫిబ్రవరి 13 : గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు రూ.26వేలు కనీస వేతనం చెల్లించాలని పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి గనిశెట్టి ఏసుదాసు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా పంచాయతీ అధికారిణి శిరీషారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో చాలీచాలని జీతాలతో కార్మికుల కుటుంబపోషణ భారంగా మారిందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వైఎస్ భద్రం, రెడ్డిపల్లి అప్పలరాజు, కార్మికసంఘం నాయకులు చెవ్వేటి నేస్తాలు, ఈశ్వరరావు, నాగేంద్ర, జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ జడ్పీ హైస్కూల్ వార్షికోత్సవం

ఎలమంచిలి, ఫిబ్రవరి 13: పట్టణంలో రైల్వే స్టేషన్ రోడ్డులోని జడ్పీ హైస్కూల్ వార్షికోత్సవం మంగళవారం సందడిగా జరిగింది. విద్యార్థినీ, విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతు కుటుంబం ఇతివృత్తంతో సన్నివేశాలు, భరతనాట్యం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం అలరించాయి. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సన్మానం

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 13: ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసి బదిలీ అయిన ఎస్‌వీ రామచంద్రమూర్తిని మంగళవారం ప్రజాప్రతినిధులు, అధికారులు సన్మానించారు. రామచంద్రమూర్తిని వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు, ప్రస్తుత ఎంపీడీవో సత్యనారాయణ,డీటీ శ్యామ్, సర్వేయర్ త్రిమూర్తి, ఈవోపీఆర్‌డీ సత్యనారాయణ సత్కరిం చారు. కార్యక్రమంలో వీఆర్‌వోలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

రక్తహీనతపై విద్యార్థులకు అవగాహన

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 13: మండలంలోని సైతారుపేట, వమ్మవరం జడ్పీ హైస్కూళ్లలో వరల్డ్ ఎనిమియా డే మంగళవారం ఘనంగా నిర్వహించారు. సర్వసిద్ధి, పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఎస్ వాసంతి, డాక్టర్ రాజేశ్వరి ఆధ్వర్యంలో విద్యార్థులకు రక్తహీనత బారిన పడకుండా తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ

కశింకోట, ఫిబ్రవరి 13 : స్థానిక డీపీఎన్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలను ప్రధానోపాధ్యాయుడు ఎంఆర్‌వీ.అప్పారావు మంగళవారం అందజేశారు. నానహి కాళీ ప్రాజెక్టు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ అసోసియేట్ టీచర్స్ డి.దుర్గాభవానీ, పి.మాధురి, కె.స్వాతి, ఉపాధ్యాయులు ఆచంట రవి, ఆనంద్, బుజ్జి, అప్పారావు పాల్గొన్నారు.

ఏటికొప్పాక విద్యార్థులకు బ్యాగుల వితరణ

ఎలమంచిలి, ఫిబ్రవరి 13: ఏటికొప్పాక మండల పరిషత్ స్కూలు విద్యార్థులకు మంగళవారం స్కూలు బ్యాగ్‌లు, పుస్తకాలను నంది ఫౌండేషన్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్కూలు కమిటీ చైర్మన్ మొల్లేటి ప్రసాద్, వైసీపీ నేతలు ఎస్.రాము నగిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

16న అక్కులమ్మ పేరంటాల తీర్థం

సబ్బవరం, ఫిబ్రవరి 13: మండలంలోని అంతకాపల్లి శివారు రావలమ్మపాలెంలో ఈనెల 16న రథసప్తమిని పురస్కరించుకొని అక్కులమ్మ పేరంటాల తీర్థం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు జక్కాన సూర్యనారాయణ, శ్రీరామమూర్తి, వెంకటరావు, సత్యనారాయణ తెలిపారు.

జేఈఈ మెయిన్స్‌లో మెరుపులు

... 3వ పేజీ తరువాయి

ఆళ్ల రామలింగంనాయుడు 99.967, అన్నెపు సాత్విక్ 99.959 పర్సంటైల్ సాధించారు. పిట్టి విద్యార్థి శ్రీరామ వెంకటకృష్ణ 99.936, అసెంట్ విద్యార్థి డొంకా హరీష్‌కుమార్ 99.931 పర్సంటైల్ సాధించారు.

చెత్తమయంగా ఇందిరా మార్కెట్

... 3వ పేజీ తరువాయి

నుంచి నెలవారీ అద్దెలు వసూలు చేసుకుంటున్న మండల పరిషత్ అధికారులు, అందులో వాటా తీసుకుంటున్న మునిసిపల్ అధికారులు చెత్త సమస్యను పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. దీనిపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబును వివరణ కోరగా, ఇందిరా మార్కెట్‌లో దుకాణాల నుంచి అద్దెలను మండల పరిషత్ అధికారులు వసూలు చేసుకుంటున్నారని, అందువల్ల శుభ్రం చేయించాల్సిన బాధ్యత కూడా వారిదేనని స్పష్టం చేశారు.

ఇంటర్, పది పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు

... 3వ పేజీ తరువాయి

సమన్వయంతో చేయాలని సూచించారు.

ఇంటర్ పరీక్షలకు 38 కేంద్రాలు

జిల్లా ఇంటర్మీడియట్ అధికారి (డీఐవో) బి.సుజాత మాట్లాడుతూ, జిల్లాలో 38 కేంద్రాల్లో ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 13,323 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 15,298 మంది.. మొత్తం 28,621 మంది పరీక్షలు రాయనున్నట్టు తెలిపారు. ఓపెన్ స్కూల్ ఎస్ఎస్‌సీ పరీక్షలు మార్చి 18వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరగుతాయని, వీటికి 788 మంది విద్యార్థులు హాజరవుతారని పేర్కొన్నారు. ఓపెన్ ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు 11 కేంద్రాల్లో మార్చి 18వ తేదీ నుంచి 26వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. వీరికి ప్రాక్టికల్ పరీక్షలు మార్చి 30 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్షలకు 991 మంది హాజరవుతారని చెప్పారు.

పది పరీక్షలకు 108 కేంద్రాలు

జిల్లా విద్యా శాఖాధికారి ఎంవీ లక్ష్మమ్మ మాట్లాడుతూ, పదో తరగతి పరీక్షలకు జిల్లాలో 108 కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. 397 పాఠశాలల నుంచి 21,257 మంది రెగ్యులర్, 2,324 మంది ప్రైవేటు విద్యార్థులు.. మొత్తం 23,581 మంది పరీక్షలు రాయనున్నట్టు వివరించారు. ఈ సమావేశంలో డీఆర్ఓ బి.దయానిధి, డీఎస్పీ సుబ్బరాజు, ఏడీ రవిబాబు, డీఈసీ మెంబర్లు శ్రీనివాసరావు, శిరీషారాణి, పీవీఎస్ మూర్తి పాల్గొన్నారు.

నరక ప్రయాణం!

... 3వ పేజీ తరువాయి

రోజూ వేల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. అచ్యుతాపురం- ఎలమంచిలి ప్రధాన మార్గంలో వెంకటాపురం జంక్షన్- వాడనర్సాపురం వద్ద ఎన్ఏవోబీ మెయిన్ గేటు వరకు రోడ్డు మొత్తం ఛిద్రమైంది. నిర్వహణ పనులు చేపట్టకపోవడంపై ఆర్అండ్‌బీ అధికారులను వివరణ కోరగా, రోజూ వందల సంఖ్యలో భారీ వాహనాలు నేవల్ బేస్‌లోకి మెటీరియల్ తీసుకెళుతుంటాయని, వీటి కారణంగానే రోడ్డు దెబ్బతిన్నదని చెబుతున్నారు. కొద్ది రోజుల క్రితం గోతులు పూడ్చినప్పటికీ భారీ వాహనాల కారణంగా సమస్య మళ్లీ మొదటికొచ్చిందని అంటున్నారు. ఆర్అండ్‌బీ అధికారుల ఆరోపణపై ప్రత్యామ్నాయ నేవల్ బేస్ అధికారులను వివరణ కోరగా, ఈ రోడ్డు తమ పరిధిలో లేదని, నిబంధనల ప్రకారం బాగు చేయించాల్సిన బాధ్యత ఆర్అండ్‌బీ శాఖదేనని స్పష్టం చేశారు.

గాయపడిన వ్యక్తికి రత్నాకర్ ఆర్థిక సాయం


వరహాలబాబుకు ఆర్థిక సాయం అందజేస్తున్న దాడి రత్నాకర్

కశింకోట, ఫిబ్రవరి 13 : ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడిన తీడ గ్రామానికి చెందిన డ్రైవర్ లగుడు వరహాలబాబును తెలుగుదేశం పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్ మంగళవారం పరామర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. దాడి వీరభద్రరావు ఛారిటబుల్ ట్రస్టు నుంచి ప్రతి నెలా రూ.3వేలు చొప్పున ఇస్తానని రత్నాకర్ ప్రకటించారు. ఈ నెలకు రూ.3వేలు నగదు అందజేశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు చిరికి సన్యాసినాయుడు, చిరికి చైతన్య, కోట్ని బాలాజీ, కచ్చళ్ల రాంబాబు, చూచుకొండ దుర్గా ప్రసాద్ ఉన్నారు.

ఘనంగా విజయ వినాయక ఆలయ వార్షికోత్సవం

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 13 : స్థానిక విజయరామరాజుపేటలోని విజయ వినాయక ఆలయ మూడో వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. వేకువజామున ప్రధాన అర్చకులు ఈశ్వరరావు ఆధ్వర్యంలో గణనాథునికి ప్రత్యేక పూజలు జరిగాయి. అనకాపల్లి సీఐ జి.శంకరరావు, 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, మందపాటి జానకిరామరాజు, జాజుల రమేష్ గణనాథున్ని దర్శించుకున్నారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ ప్రతినిదులు ఆళ్ల శివరామసత్యనారాయణ, పలకా రాము, బొబ్బిలి అప్పారావు, పిట్ల బుడ్డేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రథసప్తమి పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరించిన ఎంపీ సత్యవతి

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 13: స్థానిక సుంకరమెట్ట జంక్షన్‌లోని సూర్యనారాయణస్వామి ఆలయంలో ఈనెల 16వ తేదీన జరిగే రథసప్తమి వేడుకల పోస్టర్‌ను అనకాపల్లి ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కేఎం నాయుడు, బొడ్డేడ లక్ష్మీనరసింహరావు, బొడ్డేడ శివ, సకల గోవిందరావు, వి. వాసు, పెంటకోట అప్పలనాయుడు, ఎం. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మూలపేట సీసీ రోడ్డుకు శంకుస్థాపన

మునగపాక, ఫిబ్రవరి 13 : మండలంలోని మూలపేటలో మంగళవారం సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ భీశెట్టి గంగ అప్పలనాయుడు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ రాము, వార్డు సభ్యులు ఆడారి సత్యనారాయణ, సన్యాసినాయుడు, కాండ్రేగుల శ్రీనివాసరావు, మొల్లేటి గోవిందరావు, కాండ్రేగుల నాని, యల్లపు హైమావతి, పెద్దలు పాల్గొన్నారు.

జనసేనలో పలువురి చేరిక


జనసేనలో చేరిన యువకులతో సుందరపు

మునగపాక, ఫిబ్రవరి 13: మండంలోని తిమ్మరాజుపేట, మునగపాకల నుంచిఇ 55 మంది జనసేన పార్టీలోకి సోమవారం రాత్రి చేరారు. వీరికి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సుందరపు విజయ్‌కుమార్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు టెక్కలి పరశురాం, పార్టీ నాయకులు కె. చంద్రమోహన్, ఏవీ సత్యనారాయణ, ఆడారి శ్రీకాంత్, పాలిపిని రాము, పాలిపిని శ్రీనివాసరావు, యల్లపు సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేవీ నిర్వాసిత మత్స్యకారుల సంక్షేమానికి కృషి

» ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

రాంబిల్లి, ఫిబ్రవరి 13: నేవీ నిర్వాసిత మత్స్యకారుల సంక్షేమానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నానని ఎలమంచిలి ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు అన్నారు. మంగళవారం వాడనర్సాపురంలో జరిగిన కార్యక్రమంలో వాడనర్సాపురం, కొత్తపట్నం, యాతకొత్తపట్నం గ్రామాలకు చెందిన 2,211 మంది మత్స్యకారులకు జీవనభృతి ప్యాకేజీ చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ రెండు గ్రామాలను ఫేజ్-2లో తరలించే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్యే రమణ మూర్తిరాజులను మత్స్యకార నాయకులు సన్మానించారు.ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ యు.సుకుమార్‌వర్మ, ఎంపీపీ జి.శిరీష, జడ్పీటీసీ సభ్యులు దూళి నాగరాజు, వైస్ ఎంపీపీ కశిరెడ్డి నరసింగరావు, సర్పంచులు కారే రామారావు, వెంకటేశ్వరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓలకు సన్మానం

రాంబిల్లి, ఫిబ్రవరి 13 : మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవోలను ప్రజాప్రతినిధులు, అధికారులు సత్కరించారు. ఇక్కడ పనిచేసి బదిలీ అయిన కేఎస్.కొండలరావు, ఇక్కడకు బదిలీపై వచ్చిన ఎస్.వెంకటాచలంలను ఎంపీపీ జి.శిరీష, జడ్పీటీసీ సభ్యులు దూళి నాగరాజు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రాజు, ఏవో సి.సుమంత, వివిధ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఒప్పందం మేరకు జీవోలు విడుదల చేయాలి

ఎలమంచిలి, ఫిబ్రవరి 13 : మునిసిపల్ కాంట్రాక్టు కార్మికుల డిమాండ్‌లకు అంగీకరించిన ప్రభుత్వం జీవోలను విడుదల చేయాలని జిల్లా మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గనిశెట్టి ఏసుదాసు డిమాండ్ చేశారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు మంగళవారం కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసుదాసు మాట్లాడుతూ ప్రభుత్వం, సంఘం పెద్దల మధ్య జరిగిన ఒప్పందం మేరకు జీఓలను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు వైనూకరాజు, ఈ. చంద్రరావు, సీహెచ్.వెంకటరమణ, డి.మహేష్, వెంకటరమణ, నాగరాజులు పాల్గొన్నారు.

'వైసీపీ పాలనలో వ్యవసాయ రంగం నిర్వీర్యం'

తుమ్మపాల, ఫిబ్రవరి 13 : వైసీపీ పాలనలో వ్యవసాయ రంగం శతశాతం నిర్వీర్యమైందని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఒక ప్రకటనలో విమర్శించారు. రైతులు తీవ్ర కష్టాలు ఎదుర్కొంటున్నా ప్రభుత్వానికి పట్టకపోవడం దారుణమన్నారు. వ్యవసాయ రంగానికి కేవలం ఐదు గంటలు మాత్రమే కరెంట్ అందజేయడంతో రైతులు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. మంత్రి గుడివాడకు చెరకు రైతుల సమస్యలు పట్టడం లేదన్నారు.

నర్సీపట్నం నియోజకవర్గం

ఎంఎల్‌ఏఎస్ కళాశాలలో 16న జాబ్‌మేళా

నర్సీపట్నం, ఫిబ్రవరి 13 : ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎంఎల్‌ఏఎస్ డిగ్రీ కళాశాలలో 15 ప్రముఖ కంపెనీలతో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి టి. చాముండేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి నుంచి పీజీ వరకు చదువుకొని 18 నుంచి 35 సంవత్సరాలు వయస్సు గల యువతీ, యువకులు పాల్గొనవచ్చునని తెలిపారు. మరిన్ని వివరాలకు 9494791935, 9014765287 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

బరువు తక్కువ చిన్నారులను నర్సీపట్నం ఆస్పత్రికి తరలింపు



కృష్ణాదేవిపేట పీహెచ్‌సీలో బరువు తక్కువ చిన్నారులతో వైద్యాధికారులు, ఐసీడీఎస్ అధికారులు

కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 13: ఏఎల్‌పురం సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బరువు తక్కువగా ఉన్న చిన్నారులకు మెరుగైన వైద్యసేవలకు నర్సీపట్నం ఆసుపత్రికి పంపిస్తున్నట్టు సెక్టార్ సూపర్‌వైజర్ సత్యశ్రీ తెలిపారు. మంగళవారం ఏఎల్‌పురం-4లో ఇద్దరు చిన్నారులు బరువు తక్కువగా ఉండడాన్ని గుర్తించి స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి గాయత్రి చిన్నారులకు వైద్యసేవలందించారు. అయితే మెరుగైన వైద్యసేవలకు నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో 15రోజులు ఉంచేందుకు వారిని తరలిస్తున్నట్టు ఆమె తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది సావిత్రి, వరలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త మంగ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెదబొడ్డేపల్లి కూడలిలో కల్వర్టుకు రంధ్రం

- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- మరమ్మతులు చేపట్టాలని వినతి

నర్సీపట్నం, ఫిబ్రవరి 13 : పెదబొడ్డేపల్లి జంక్షన్‌లోని చోడవరం రోడ్డులో కల్వర్టు మరమ్మతులకు గురైంది. దీంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. నెల రోజుల క్రితం పెదబొడ్డేపల్లి జంక్షన్‌లోని కల్వర్టు వద్ద డ్రైనేజీలో పూడిక పేరుకుపోయి మురుగు రోడ్డుపై ప్రవహించడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యను కౌన్సిల్ సమావేశంలో వైసీపీ కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర ప్రస్తావించినా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో స్థానిక ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేశ్ స్వయంగా రంగంలోకి మునిసిపల్ అధికారులను పరుగులు పెట్టించి పూడిక తీయించి తాత్కాలింగా సమస్య పరిష్కరించారు. అయితే పూడిక తొలగించే క్రమంలో కల్వర్టుకు డ్రిల్లింగ్ మిషన్‌తో రంధ్రం చేశారు. డ్రైనేజీలో పూడిక తీసేసిన తర్వాత కల్వర్టు రంధ్రనికి మూత ఏర్పాటు చేయలేదు. ప్రమాదాలు జరగకుండా రెండు స్టాపర్ బోర్డులు పెట్టి చేతులు దులుపుకున్నారు. దీని వలన వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారి ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. తక్షణమే కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



పెదబొడ్డేపల్లి కూడలిలో కల్వర్టుకు రంధ్రం పడిన దృశ్యం

తాండవ లీకేజీలపై ఆర్డీవో కార్యాలయం ఎదుట 17న జనసేన నిరసన

నాతవరం, ఫిబ్రవరి 13 : జిల్లాలో ప్రధాన రిజర్వాయర్ అయిన తాండవ మెయిన్ గేట్లుకు మరమ్మతులు చేపట్టాలంటూ ఈనెల 17వ తేదీన నర్సీపట్నం ఆర్‌డీవో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపడుతున్నట్టు జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన వీరసూర్యచంద్ర అన్నారు. మంగళవారం తాండవ జలాశయం ప్రధాన గేట్లను జనసేన నాయకులు, కార్యకర్తలు పరిశీలించారు. ఈ సందర్భంగా వీరసూర్యచంద్ర మాట్లాడుతూ.. ఎన్నోసార్లు తాండవ లీకేజీలను అరికట్టాలని వివిధ రూపాలలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. లీకేజీల ద్వారా నీరు వృథాగా పోతుండడంతో ఆయకట్టు కింద 28వేల ఎకరాల వరి పంట పొట్ట దశలో ఎండిపోయిందన్నారు. వచ్చే ఖరీఫ్‌కు అయినా రైతులు ఇబ్బంది పడకుండా వెంటనే తాండవ గేట్లకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఈనెల 17వ తేదీన నర్సీపట్నం ఆర్‌డీవో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపడతామని సూర్యచంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు వెలగల వెంకటరమణ మంకు కృష్ణకుమార్, మాకిరెడ్డి వెంకటరమణ పాల్గొన్నారు.

కశిమిలో తాగునీటికి ఇక్కట్లు

గొలుగొండ, ఫిబ్రవరి 13: మండలంలోని కశిమి గ్రామంలో తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలోని సోలార్ తాగునీటి పథకం మోటారు రెండేళ్ల క్రితం మరమ్మతులకు గురైంది.మండలంలోని కశిమి పంచాయతీలో 300 మంది జనాభా ఉన్నారు. తాగునీటి అవసరానికి గ్రామంలో బోర్లు రెండు ఉన్నాయి. అయితే సోలార్ ప్లాంట్‌కు సంబంధించి మోటారు మరమ్మతులకు గురైంది. దీంతో రెండేళ్లుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే వేసవికి సోలార్ ప్లాంట్ మరమ్మతులు చేపట్టి తాగునీరు అందించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కశిమిలో రెండేళ్లుగా మరమ్మతులకు గురైన సోలార్ తాగునీటి పథకం

పలు గ్రామాల్లో బీజేపీ 'పల్లెకు పోదాం'

నాతవరం, ఫిబ్రవరి 13 : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించడానికే పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు పేరూరి బుల్లిదొర అన్నారు. మంగళవారం మండలంలోని ములగపూడి, నాతవరం, మర్రిపాలెం తదితర గ్రామాలలో ఆటోల ద్వారా కేంద్రం ప్రవేశపెట్టిన పథకాల గురించి బీజేపీ నాయకులు ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు చౌడుపల్లి సత్తిబాబు, మార్తి దేవి ఇటంశెట్టి అక్కయ్యమ్మ పాల్గొన్నారు.



ములగపూడిలో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

జేఈఈ మెయిన్స్‌లో మెరుపులు

... 3వ పేజీ తరువాయి

అళ్ల రామలింగంనాయుడు 99.967, అన్నెపు సాత్విక్ 99.959 పర్సంటైల్ సాధించారు. ఫిట్జీ విద్యార్థి శ్రీరామ వెంకటకృష్ణ 99.936, అసెంట్ విద్యార్థి డొంకా హరీష్‌కుమార్ 99.931 పర్సంటైల్ సాధించారు.

చెత్తమయంగా ఇందిరా మార్కెట్

... 3వ పేజీ తరువాయి



మాంసం దుకాణాల వద్ద అపరిశుభ్రత

నుంచి నెలవారీ అద్దెలు వసూలు చేసుకుంటున్న మండల పరిషత్ అధికారులు, అందులో వాటా తీసుకుంటున్న మునిసిపల్ అధికారులు చెత్త సమస్యను పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. దీనిపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబును వివరణ కోరగా, ఇందిరా మార్కెట్‌లో దుకాణాల నుంచి అద్దెలను మండల పరిషత్ అధికారులు వసూలు చేసుకుంటు న్నారని, అందువల్ల శుభ్రం చేయించాల్సిన బాధ్యత కూడా వారిదేనని స్పష్టం చేశారు.

ఇంటర్, పది పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు

... 3వ పేజీ తరువాయి

సమన్వయంతో చేయాలని సూచించారు.

ఇంటర్ పరీక్షలకు 38 కేంద్రాలు

జిల్లా ఇంటర్మీడియట్ అధికారి (డీఐవో) బి.సుజాత మాట్లాడుతూ, జిల్లాలో 38 కేంద్రాల్లో ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 13,323 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 15,298 మంది.. మొత్తం 28,621 మంది పరీక్షలు రాయనున్నట్టు తెలిపారు. ఓపెన్ స్కూల్ ఎస్ఎస్‌సీ పరీక్షలు మార్చి 18వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరుగుతాయని, వీటికి 788 మంది విద్యార్థులు హాజరవుతారని పేర్కొన్నారు. ఓపెన్ ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు 11 కేంద్రాల్లో మార్చి 18వ తేదీ నుంచి 26వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. వీరికి ప్రాక్టికల్ పరీక్షలు మార్చి 30 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్షలకు 991 మంది హాజరవుతారని చెప్పారు.

పది పరీక్షలకు 108 కేంద్రాలు

జిల్లా విద్యా శాఖాధికారి ఎంవీ లక్ష్మమ్మ మాట్లాడుతూ, పదో తరగతి పరీక్షలకు జిల్లాలో 108 కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. 397 పాఠశాలల నుంచి 21,257 మంది రెగ్యులర్, 2,324 మంది ప్రైవేటు విద్యార్థులు.. మొత్తం 23,581 మంది పరీక్షలు రాయనున్నట్టు వివరించారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ బి.దయానిధి, డీఎస్‌పీ సుబ్బరాజు, ఏడీ రవిబాబు, డీఈసీ మెంబర్లు శ్రీనివాసరావు, శిరీషారాణి, పీవీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

చోడవరం నియోజకవర్గం

లక్ష టన్నులు దాటిన చెరకు క్రషింగ్

- త్వరలో పేమెంట్లు చెల్లింపునకు సన్నాహం
- గోవాడ షుగర్ ఫ్యాక్టరీ ఎండీ సన్యాసినాయుడు

చోడవరం, ఫిబ్రవరి 13: గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో ప్రస్తుత క్రషింగ్ సీజన్‌లో మంగళవారం నాటికి లక్ష టన్నులు చెరకు క్రషింగ్ చేసినట్టు ఫ్యాక్టరీ ఎండీ వి.సన్యాసినాయుడు తెలిపారు. రైతులు, కార్మికుల సహకారంతో లక్ష టన్నుల చెరకు క్రషింగ్ చేయగలిగామని, ఇదే స్ఫూర్తితో ఈ ఏడాది లక్ష్యం మేరకు క్రషింగ్ చేస్తామని చెప్పారు. చెరకు రైతులకు ఈ ఏడాది నేరుగా కటింగ్ పర్మిట్లు మెసేజ్ ద్వారా చేరేలా చర్యలు చేపట్టామన్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు చేసిన చెరకు క్రషింగ్ మేరకు 15 రోజులకోసారి పేమెంటు ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. వచ్చే సీజన్‌కు రైతులంతా మెరుగైన చెరకు వంగడాలు నాటి ఫ్యాక్టరీ అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని ఎండీ విజ్ఞప్తి చేశారు.

డిగ్రీ కాలేజీలో జాతీయ మహిళా దినోత్సవం

చోడవరం, ఫిబ్రవరి 13: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీ మంగమ్మ, డాక్టర్ రత్నభారతి మహిళా దినోత్సవం గురించి విద్యార్థినులకు వివరించారు. అనంతరం విద్యార్థినులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్, అధ్యాపకులు అప్పలనాయుడు, మాల్యాద్రి, పిచ్చమ్మ, సత్యవతి. సరస్వతి పాల్గొన్నారు.

గోవాడలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

చోడవరం, ఫిబ్రవరి 13: మండలంలోని గోవాడ పంచాయతీలో మంగళవారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా పంచాయతీలోని స్థానికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందచేశారు. ఈ కార్యక్రమంలో గవరవరం పీహెచ్‌సీ వైద్యసిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఘనంగా వీర గంగాలమ్మ జాతర మహోత్సవం

రోలుగుంట, ఫిబ్రవరి 13: మండలంలోని ఎంకే పట్నం పంచాయతీ శివారు పెదపేట గ్రామంలో మంగళవారం వీర గంగాలమ్మ జాతర మహోత్సవాన్ని నిర్వహించారు. జాతర మహోత్సవం సందర్భంగా ప్రభుత్వ విప్ ధర్మశ్రీ హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారికి సంబంధించి మాన్యం భూమి సమస్యపై పలుమార్లు గ్రామస్థులు విన్నవించారని, సమస్యను పరిష్కరించి దేవుడు మాన్యం వచ్చేలా తగిన చర్యలు తీసుకుంటానని తెలిపారు. దీనిలో భాగంగానే పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

ఏపీటీఎస్ రాష్ట్ర ఉపాధ్యడిగా త్రినాథ



త్రినాథ

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 13: ఏపీటీఎఫ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండలానికి చెందిన తమరాన త్రినాథ ఎన్నికయ్యారు. ఈ నెల 11న విజయవాడలో జరిగిన ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలలో త్రినాథను రెండో సారి ఎన్నుకున్నారు. ఏపీటీఎఫ్ మండల, జిల్లా సంఘాధ్యక్షులుగా, ఉమ్మడి జిల్లా సబ్ కమిటీ సభ్యులు త్రినాథ పనిచేశారు. ఈ సందర్భంగా త్రినాథ మాట్లాడుతూ సీపీఎస్ విధానం రద్దు, 117 జీవో ఎత్తివేయాలని, మున్సిపల్ ఉద్యోగులకు సర్వీస్ రూల్ వర్తింపు, ఉపాధ్యాయ పోస్టుల పెంపు, ఐఆర్‌ని ప్రకటించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

చెరకు రైతుల సమస్యలు పట్టని ప్రభుత్వం

వైసీపీ పాలనలో అన్నీ అసంపూర్తి పనులే..

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజికుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి

దేవరాపల్లి, ఫిబ్రవరి 13: రెండు నియోజకవర్గాల్లో చెరకు రైతుల సమస్యలు ప్రభుత్వానికి పట్టడం లేదని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ.కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు అన్నారు. మండలంలోని బి.కింతాడ గ్రామం నుంచి బాబు షూరిటీ.. భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం పాదయాత్రను మంగళవారం ప్రారంభించారు. బి.కింతాడ చెరకు కాటా వద్ద నిరసన తెలిపుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రామానాయుడు, పీవీజీ కుమార్ మాట్లాడుతూ మాడుగుల నియోజక వర్గంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, చోడవరం నియోజక వర్గంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ లాంటి ఉద్దండులు ఉన్నా చెరకు రైతుల సమస్యలు పరిష్కారం కాకపోవడం విచారకరమని వాపోయారు. వారం రోజులు పైబడి కాటాల వద్ద చెరకు ఉన్నా ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తున్నదన్నారు. రైతు ద్రోహి జగన్మోహన్‌రెడ్డి.. వైసీపీ ప్రభుత్వం దగాకోరు ప్రభుత్వం అని నినాదాలు చేశారు. గతంలో గోవాడే కాకుండా అన్ని సుగర్ ఫ్యాక్టరీలు లాభాల బాటలో ఉంటే, వైసీపీ ప్రభుత్వంలో అప్పుల ఊబిలో కూరుకుపోయాయని వాపోయారు. రైవాడ, కోణాం ప్రాజెక్టులకు కనీసం మైనర్ రిపేర్లు చేయలేదన్నారు. ఆధునీకరణకోసం రైవాడ జలాశయం కాలువలకు జైకా నిధులు టీడీపీ మంజూరు చేస్తే పనులు పూర్తి కాలేదన్నారు. ఐదేళ్లలో రైతుల కోసం చేసిన అభివృద్ధి చూపిస్తే రాజకీయ సన్యాసం పుచ్చుకుంటామన్నారు. అనంతరం కలిగొట్ల వేచలం రహదారిలో వేసిన బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు వేయక అసంపూర్తిగా ఉండి పోవడంతో బ్రిడ్జిపై నిరసన తెలిపారు. అలాగే పైడితల్లమ్మ గ్రామ దేవతను దర్శించుకున్నారు. తిమిరాం మార్కెట్ యార్డు అసంపూర్తిగా అభివృద్ధి జరగక పోవడంతో అక్కడ నిరసన తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు సూర్యనారాయణ, నాయకులు పి.పాత్రునాయుడు, కె.బాబూరావు, ఆర్.బలరామమూర్తి, కడింనాగేశ్వరరావు, కాసుబాబు, బండారు రామారావు, చల్లానానాజీ, కోళరెడ్డి అప్పలనాయుడు, చెరకాన సూర్యనారాయణ, చింతా సాంబమూర్తి, కర్రి నాయుడు పాల్గొన్నారు.



బి.కింతాడ చెరకు కాటా వద్ద టీడీపీ నాయకుల నిరసన

గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యం

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

రోలుగుంట, ఫిబ్రవరి 13: గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పేర్కొన్నారు. వడ్డిప నుంచి బీబీ పట్నం వరకు రూ.2.3 1కోట్లతో తారు రోడ్డు నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హామీ ప్రకారం శతశాతం వసతుల కల్పనకు చర్యలు తీసుకున్నామన్నారు. ఈ రహదారి పనులు ఐదు నెలల్లో పూర్తిఅవుతాయని, దీంతో ఈ ప్రాంత ప్రజల కష్టాలు తొలగినట్లేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ తమరాన వెంకటరమణ, బీబీ పట్నం సర్పంచ్ గరగా విశ్వేశ్వరరావు, నాయకులు పోతల శ్రీనివాసరావు, రేవళ్ల ఈశ్వరరావు, రాజులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.



వడ్డిప-బీబీ పట్నం రోడ్డు శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ధర్మశ్రీ

మౌలిక సదుపాయాలక పెద్దపీట

బుచ్చెయ్యపేట: మౌలిక సదుపాయాలకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని ప్రభుత్వ విప్ ధర్మశ్రీ అన్నారు. చింతపాక సచివాలయం, ఆర్బీకె కేంద్ర భవనాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ డి.నాగేశ్వరిదేవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, సర్పంచులు జి.శ్రీను, ఇందిర, ఎంపీడీవో వెంకటాచార్యులు, వైసీపీ నేత కొండబాబు పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పీఎస్ఎన్ రాజు

స్థానికులకే టీడీపీ/జనసేన టిక్కెట్ కేటాయించాలి

చోడవరం, ఫిబ్రవరి 13: రానున్న ఎన్నికల్లో జనసేన/టీడీపీ టిక్కెట్ స్థానిక నాయకులకే కేటాయించాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్ఎన్ రాజు సూచించారు. స్థానిక కల్యాణ మండపంలో మంగళవారం పార్టీ కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో టీడీపీ/జనసేన పొత్తులో భాగంగా తనకు టిక్కెట్ ఇస్తే పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని, టీడీపీ అభ్యర్థిగా ఎవరికి ఇచ్చినా శక్తివంచన లేకుండా కష్టపడతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జనసేనజిల్లా నాయకులు అల్లం రామప్పారావు, గూనూరు మూలినాయుడు, కర్రి రమేష్ నాలుగు మండలాల జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమానికి విశాఖ డెయిరీ తోడ్పాటు

చోడవరం, ఫిబ్రవరి 13: విశాఖ డెయిరీ సభ్య రైతులకు డెయిరీ అండగా ఉంటుందని డైరెక్టర్ దాడి పవన్‌కుమార్ తెలిపారు. చోడవరం యూనిట్ కార్యాలయంలో మంగళవారం పాడి రైతులకు రగ్గులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. యూనిట్ పరిధిలోని సుఖీభవ అర్హత కార్డు కలిగిన 16,904 మంది సభ్య రైతులకు వీటిని అందచేయనున్నట్టు డైరెక్టర్ తెలిపారు. అంబేరుపురం, పీఎస్ పేట, బెన్నవోలు, బంగారమ్మపాలెం, అంకుపాలెం పాల సంఘాల పరిధిలోని సభ్య రైతులకు మంగళవారం రగ్గులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డెయిరీ మేనేజర్ జి.రాము, సూపర్‌వైజర్ రమణ, పాడి రైతులు పాల్గొన్నారు.



రైతులకు రగ్గులు పంపిణీ చేస్తున్న దృశ్యం

దుడ్డుపాలెంలో రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన

చోడవరం, ఫిబ్రవరి 13: మండలంలోని దుడ్డుపాలెం మెట్టపై పంచాయతన శ్రీరామాలయ నిర్మాణానికి మంగళవారం భూమి పూజ నిర్వహించారు. ముందుగా గోపూజ చేసి కొత్త నాగలితో కార్యక్రమం ప్రారంభించారు. రాపర్తి రాజా నరేంద్రశర్మ ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణ ప్రారంభోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ పంచాయతన చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ముక్కు. శివ సూర్య ప్రసాదరావు, కార్యదర్శి ప్రొఫెసర్ కార్తీకరావు, దుడ్డుపాలెం సేవా సంఘం నాయకులు కూర్మదాసు, మాలిబాబు, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



రామాలయ నిర్మాణానికి భక్తుల పూజలు

నరక ప్రయాణం!

... 3వ పేజీ తరువాయి

రోజూ వేల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. అచ్యుతాపురం- ఎలమంచిలి ప్రధాన మార్గంలో వెంకటాపురం జంక్షన్- వాడనర్సాపురం వద్ద ఎన్ఏవోబీ మెయిన్ గేటు వరకు రోడ్డు మొత్తం ఛిద్రమైంది. నిర్వహణ పనులు చేపట్టకపోవడంపై ఆర్‌అండ్‌బీ అధికారులను వివరణ కోరగా, రోజూ వందల సంఖ్యలో భారీ వాహనాలు నేవల్ బేస్‌లోకి మెటీరియల్ తీసుకెళుతుంటాయని, వీటి కారణంగానే రోడ్డు దెబ్బతిన్నదని చెబుతున్నారు. కొద్ది రోజుల క్రితం గోతులు పూడ్చినప్పటికీ భారీ వాహనాల కారణంగా సమస్య మళ్లీ మొదటికొచ్చిందని అంటున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారుల ఆరోపణపై ప్రత్యామ్నాయ నేవల్ బేస్ అధికారులను వివరణ కోరగా, ఈ రోడ్డు తమ పరిధిలో లేదని, నిబంధనల ప్రకారం బాగు చేయించాల్సిన బాధ్యత ఆర్‌అండ్‌బీ శాఖదేనని స్పష్టం చేశారు.

నేడు గర్నికం బాలచెంచమ్మ తీర్థమహోత్సవం

రావికమతం, ఫిబ్రవరి 13: మండలంలో గర్నికం బాలచెంచమ్మ వార్షిక తీర్థ మహోత్సవం నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు పూర్తిచేసింది. గ్రామానికి చెందిన బాలచెంచమ్మ సజీవ సహగమనం చెందడంతో నాటి నుంచి గ్రామస్థులంతా గ్రామ దేవతగా కొలుస్తున్నారు. బంధువులు, స్నేహితులతో పాటు ఉత్తరాంధ్ర నుంచి భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.

మాడుగుల నియోజకవర్గం



రామానాయుడుతో కలిసి నడుస్తున్న మాడుగుల టీడీపీ నాయకులు

గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ' కార్యక్రమం

మాడుగుల రూరల్, ఫిబ్రవరి 13: మండలంలోని బొయిల కింతాడ, కలిగొట్ల, తిమిరాం తదితర గ్రామాల్లో మంగళవారం 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడుతో పాటు పార్టీ మాడుగుల పట్టణ అధ్యక్షుడు రంజిత్ వర్మ, నాయకులు లెక్కల కాశిబాబు, సూర్యనారాయణరాజు, మరువాడ ఈశ్వరరావు, బుద్దాల రమణ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. వైసీపీ పాలనలో ప్రజలు విసిగిపోయారని, టీడీపీపై ఎంతో నమ్మకంతో ఉన్నారని ఈ సందర్భంగా రామానాయుడు పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయకేతనం ఎగురవేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

వీఆర్‌వోల సమస్యల పరిష్కారానికి కృషి



క్యాలెండర్లు అందిస్తున్న సంఘం జిల్లా నేత రామకాసు

చీడికాడ, ఫిబ్రవరి 13: వీఆర్‌వోల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.శ్రీనాధురామకాసు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వీఆర్వోలకు డెయిరీలు, క్యాలెండర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా ఉండాలని, సంఘంపై విధేయత కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వోల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతరామయ్య, జిల్లా కోశాధికారి కోడూరు గౌరీశంకర్, అనకాపల్లి డివిజన్ అధ్యక్షులు గణేష్, నర్సీపట్నం డివిజన్ అధ్యక్షులు సత్తిబాబు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోదినాయుడు, శ్రీనివాస్, డివిజన్ కమిటీ సభ్యులు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

ఆశాజనకంగా చెరకు సాగు

- నర్సీపట్నం ఉప గణాంక అధికారి బానోజీ

చీడికాడ, ఫిబ్రవరి 13: చెరకు సాగు ఆశాజనకంగా ఉందని నర్సీపట్నం రెవెన్యూ డివిజన్ ఉపగణాంక అధికారి బానోజీ తెలిపారు. మండలంలోని మంచాల గ్రామంలో గండి సన్నిబాబు పొలంలో చెరకు సాగును మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చెరకుగడలను తూకం వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెరకు సాగులో ఎకరాకు 35 నుంచి 38 టన్నుల వరకూ రావచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే రైతులు సకాలంలో సేంద్రియ ఎరువులు, సాగునీరు పెట్టడం వల్ల దిగుబడులు పెరిగినట్టు తమ పరిశీలనలో తేలిందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ ఏఎస్‌వో రెడ్డి రాణి పాల్గొన్నారు.



మంచాలలో చెరకును పరిశీలిస్తున్న బానోజీ